# శ్రీ కుళశేఖరాళ్వారులు




సర్వశోభాసమన్వితమైన కేరళదేశములో 'కోళి' అను పట్టణము కలదు. దానికి సంస్కృతమున 'కుక్కుట' నగరమని పేరు. ఆ పట్టణమును కవులు ఇంద్రుని కన్నా మిన్నగా అభివర్ణించిరి. ఆ పట్టణాన్ని ధృఢవ్రతుడను రాజు పాలించు చుండెను. అతనిది చేద వంశము. ఆ రాజు సత్సంతానమును కోరి శ్రీ హరిని ఉపాసించెను. స్వామి సంప్రీతుడై ఒక పుత్రుడు కలుగునట్లు అనుగ్రహించెను. ఆయనకు పరాభవ సంవత్సరంలో కుంభమాసంలో శుక్లపక్షంలో పునర్వసు నక్షత్రమున దశమి, గురువారమునాడు తమ వంశమును ప్రకాశింపజేసే కుమారుడు కలిగాడు. ఆ శిశువునకు 'కులశేఖరుడు' అని నామకరణము చేసి క్రమముగా అన్ని సంస్కారములను చేసెను. కులశేఖరుడు గురువుల ద్వారా సర్వవేదశాస్త్రములను, ధనుర్వేదమును అభ్యసించెను. ఈవిధముగా పెరిగి రాజనీతి, ధర్మము, పరిపాలన దక్షత, పరాక్రమము మొదలగు గుణములతో ప్రకాశించుచున్న కులశేఖరులయందు రాజ్యభారము నుంచి ధృఢవ్రతుడు తపోవనమునకు వెళ్ళెను. కులశేఖరులు స్వతంత్రుడై రాజ్యపాలన చేయసాగెను. ఇది ఆనాటి రామరాజ్యమా అన్నట్లుగా ప్రజలను సంతోషింపచేయుచూ పాలించెను. తన పరాక్రమముచేత శత్రువులను జయించి రాజ్యమును విస్తరింపచేసెను. 'దుర్బలస్య బలంరాజా' అను శాస్త్రమును అనుసరిచి బలవంతునిచే పీడింపబడు దుర్బలులకు అండగా నిలచి దుష్టశిక్షణము సాధు రక్షణము చేయుచూ ప్రజారంజకముగా కులశేఖరులు పరిపాలించుచుండిరి.

ఇలా రాజ్యపాలన చేస్తూండగా భగవదాజ్ఞ శిరసావహించి పరమ పదమునుండి విష్వక్సేనులు వచ్చి కులశేఖరులకి పంచసంస్కారములను ప్రసాదంచి మంత్ర మంత్రార్ధములతో తత్త్వోపదేశమును అనుగ్రహించెను. దానిచే సహజంగా వారిలోనున్న దివ్యజ్ఞానము ప్రజ్వలించినది. దానిచే కులశేఖరులు ఆళ్వారులైరి. వారు నిరంతరము భగవద్భక్తిని, భగవత్సంబంధులగు భాగవతులయందు భక్తిని కలిగి నరంతరము వారి సేవలోనే కాలము గడపసాగిరి. దానివలన రాజ్య వ్యవహారాలు భాగవతసేవకు ఆటంకముగా తోచినది. రాజ్య నిర్వహణ బాధ్యతలు ప్రక్కనబెట్టి భాగవతగోష్టితో మునిగి ఉండెడివారు. భగవత్ భక్తిలేనివారి మధ్య ఉండటము చెరసాలలో ఉన్నట్లుగా తోచేది. వారికి భగవత్ భాగవత కైంకర్యము మీదనే రుచి పెరిగినది. భగవంతుని కృపచే లభించే ఈ రాజ్యము భగవత్ భాగవత కైంకర్యమునకే వినియోగము

కావలెనని భావించేవారు. అందుకని సమస్త రాజ్యమును భాగవత అధీనము చేసి విభీషణునివలె 'శ్రీరామచంద్రః శరణం మమ' అనుకున్నారు. ఈ ఆళ్వారుకు విభవావతరములలో శ్రీరామచంద్రుని యందు అర్చావతారులగు శ్రీవేంకటేశ్వరస్వామియందునూ ప్రీతి ఏర్పడినది వారి యందే మనస్సు లగ్నమయినది. 'పడియాకిడన్దు ఉన్ పవళవాయ్ కాణ్బేనే' అని శ్రీవేంకటేశ్వరుని ప్రార్థించారు. నీ ముందు గడపగా పడి ఉండైనా పగడమువంటి నీ అధర సౌందర్యమును నిత్యమూ సేవించే భాగ్యము కలిగించమని భక్తితో పాడారు.

**శ్రీరంగ యాత్రా శ్రీరంగయియాసా చైవ నారధీ।**
**ఉత్తారయతి సంసారాత్ నిత్య వాసస్తు కిం పునః॥**

'ఓ నారదా! శ్రీ రంగమునకు వెళ్ళినా, వెళ్ళ దలంచినా సంసార ముక్తి కలుగును. ఇక శ్రీరంగ నిత్యవాసము చేసేవారిని ఏమి చెప్పగలము' అని శ్రీ రంగ మహత్మ్యమును వినిన కులశేఖరాళ్వారులకు శ్రీ రంగ యాత్ర చేయవలెనను సంకల్పము హృదయమునందు గట్టిగా నాటుకొనినది. ఇక వారికే తాము అనుభవిస్తున్న రాజ్యభోగములన్నీ తమ ప్రవృత్తికి, లక్ష్యానికి ప్రతికూలము అనిపించసాగినది. పైగా ఈ సుఖాలన్నీ అశాశ్వతమైనవి, ఈ సింహాసమున నేను ఇక ఉండరాదని నిర్ణయించుకొనిరి. శ్రీ రంగ నిత్య వాసమే తమ తక్షణ కర్తవ్యమనుకొనిరి. తాము శ్రీ రంగ యాత్రకు బయలు దేరుతున్నామని శ్రీ రంగం తమతో రాగోరు వారందరనూ బయలుదేరి రావచ్చునని తెలిసేటట్లుగా చాటింపువేసారు. మంత్రులు ఆలోచనలో పడిరి. మన రాజు అక్కడికి వెళ్ళి శ్రీ రంగనాథుని సేవించినచో ఆ దివ్య సౌందర్యములో మునిగి తిరిగి రాజ్యానికి రారేమోనని భయపడిరి. ముక్తపురుషుని వలె 'నచ పునరావర్తతే' మరల తిరిగి ఇవటకిరారు. అపుడీ రాజ్యమేమగును, ఈ ప్రజలేమగుదురు? అని ప్రజాక్షేమమును కోరు మంత్రులు ఆలోచించిరి. మనరాజును ఎలాగైనా శ్రీ రంగమునకు పోకుండా ఆపవలెనని అనుకున్నారు. తెల్లవారినచో ఆయన ఆగరని ఆ రాత్రికి రాత్రే ఒక ఉపాఉము ఆలోచించిరి. కులశేఖరుల యొక్క భాగవత నిష్ఠ గురించి బాగుగా తెలిసిన మంత్రులు రహస్యముగా కొంతమంది భాగవతోత్తములను కలుసుకొనిరి. వారితో 'మన ప్రభువునకు ప్రత్యక్ష దైవములు మీరే. మీ మాటను రాజు జవదాటడు. కనుక దేశ క్షేమమును కోరి మీరు రేపు ఉదయమునే కులశేఖరుల శ్రీ రంగ యాత్రను విరమింపచేయమని' ప్రార్థించిరి. భాగవతోత్తములు మంత్రులు చెప్పిన దానిని విని ఆలోచించి వారి ప్రార్థనను అంగీకరించిరి.

మరునాడు ఉదయము కులశేఖరులు స్నానానుష్ఠానములు తీర్చుకుని శ్రీ రంగ యాత్రన ఉద్ఘోషించుచూ సపరివారముగా బయలుదేరినారు. అపుడే వైష్ణవోత్తములు రాజునకు ఎదురుగా వచ్చినారు.

ఇంత మంది భాగవతోత్తములను సేవింపగానే కులశేఖరుల మనస్సు ఆనందముతో నృత్యము చేసెను. ఆహా! ఈ రోజు ఎంత భాగ్యము వీరి సేవ లభించినది. కోట్లు విలువచేసే బంగారము ఉన్ననూ ఇంతటి భాగవతోత్తములను సేవించిన ఆనందము లభించదు. కనుక ముందు వీరిని ఆరాధించి సంతోష పరచాలనుకున్నారు. భగవంతుని ఆరాధన కన్నా భాగవత ఆరాధన చాలా గొప్పది కదా! అని వెంటనే శ్రీరంగ యాత్రను విరమించి భాగవతోత్తములను తీసుకొని కోటకు తిరిగివచ్చారు. లోక కల్యాణ పరాయణులు, వేదవేదాంత పారంగతులు, భగవంతునిపై సర్వభారములు అర్పించి కైంకర్య నిరతులైన ఆ భాగవతోత్తములను తగిన గృహమునందు విడిది చేయించిరి. ఆర్ఘ్య, పాద్యాదులతో అర్చించిరి. తరువాత రుచికరమైన అనేక భోజ్య పదార్థాలతో వారికి విందు ఏర్పాటు చేసిరి. వారి భోజనము పూర్తి అగువరకు తాను భుజింపక వారి శేషప్రసాదమును భుజించి వారిని వివిధ బహుమానములతో సంతృప్తి పడేటట్లు సత్కరించిరి. తరువాత శుశ్రూషాపరుడై వారి వద్ద నుంచి అనేక పరమార్థములను వినుచూ సాయంకాలం వరకూ గడిపారు. ఈనాడు నా జన్మ ఈ భాగవతసేవతో చరితార్థమయినది. శ్రీ రంగ యాత్ర రేపు అనుకొనినారు. మరునాడు మరల శ్రీ రంగ యాత్ర చాటింపు వేయించిరి. మరల వైష్ణవ భాగవతోత్తములు వచ్చుట, మరల రాజు వెనుకకు మరలుట ఈ విధముగ శ్రీ రంగ యాత్ర భంగమగుట జరుగుచుండెడిది. ఇదెయే కులశేఖరుల నిత్య కార్యక్రమమైనది. అందుకే వారిని గూర్చి ఒక శ్లోకములో–

**ఘుష్యతే యస్య నగరే రంగయాత్రా దినేదినే!**
**తమహం శిరసా వందే రాజానం కులశేఖరం॥**

ఈ విధంగా మంత్రులు పన్నిన ఉపాయము ఫలించినది. రాజ్యపాలనమున ఆయనకు ఆశక్తి అసలేలేదు. మంత్రులే ధర్మపరాయణులై రాజ్యకార్యములను తామే నిర్వహించుచుండిరి. భరతుని రాజ్యపాలనమున రామ పాదుకలకే ప్రాధాన్యమిచ్చినట్టు కోళీ పట్టణమున కులశేఖరులకన్నా, ఆయన రాజముద్రికకే ప్రాధాన్యము వచ్చినది. శ్రీ రంగయాత్ర సాగకపోయినా కులశేఖరులు కొన్ని దివ్యక్షేత్రములు దర్శించి ఆయా మూర్తులను పాడిరి. శ్రీరంగయాత్ర మాత్రము భవిష్యత్ స్వప్న రూపముగానే మిగిలిపోయినది.

కులశేఖరులు గొప్ప భగవద్భక్తులు. వారికి చిన్నప్పటి నుండే శ్రీ రామచంద్రుడిపై ఎంతో భక్తి విశ్వాసాలు కలిగినవి. శ్రీమద్రామాయణం పేరు వినగానే తన్మయత్వంతో అన్ని విషయాలు మరచి బాహ్యస్మృతినే కోల్పోయేవారు. ఒకనాడు కులశేఖరాళ్వార్లు తమ ఆస్థాన పండితులను పిలిపించి ప్రతిరోజూ శ్రీ మద్రామాయణ కాలక్షేపము చేయవలసిందిగా కోరారు. ఆ వచ్చిన పండితులు రాజుగారి కోరిక ప్రకారం రామాయణ కాలక్షేపం ఆరంభించారు. అయోధ్యాకాండ ముగిసి, అరణ్యకాండ మొదలైంది. పౌరాణికులు

ఎంతో చక్కగా వ్యాఖ్యానిస్తూ కాలక్షేపం కొనసాగిస్తున్నారు. శ్రీ రామచంద్రమూర్తి దండకారణ్యంలో ఉన్నప్పుడు శూర్పణఖ అవమానానికి ప్రతీకారం కోసం పద్నాలుగు వేలమంది రాక్షసులతో ఖరదూషణాదులు రామునిపై యుద్ధానికి వచ్చారని చెప్పారు. రామకథా శ్రవణంలో తన్మయులై మానసికంగా కులశేఖరులు దండకారణ్యంలో రాముని ప్రత్యక్షంగా దర్శిస్తున్నారు. ఆ యుద్ధం నిజంగా అపుడే జరుగుతున్నదని భావించి అంతమంది రాక్షసులతో రాముడు ఒక్కడే ఎలా యుద్ధం చేయగలరు అని ఆతృత పడ్డారు. వెంటనే తమ సైన్యాధిపతులతో 'నా రాముడు ఒంటరివాడైనాడు మనం చతురంగ బలంతో రాముని సహాయానికి వెళ్ళాలి వెంటనే సైన్యం సిద్ధం చేయండి' అని ఆజ్ఞాపించారు. సేనాపతి రాజుగారి ఆజ్ఞను అనుసరించి సైన్యాన్ని సిద్ధం చేసారు. ఆ సైన్యంతోపాటు కులశేఖరాళ్వార్లు బయలుదేర సిద్ధపడ్డారు. శ్రీరామచంద్రుడిపై అనన్య భక్తి ప్రపత్తులతో కులశేఖరాళ్వార్లు మైమరచియున్న స్థితిని గమనించి పౌరాణికులు వారిని ఎలా శాంతింపచేయాలా అని ఆలోచించారు. వారికి వెంటనే శ్రీరామచంద్రుని విజయ వార్తను తెలియజేస్తే తప్ప వారి మనస్సు శాంతించదని గమనించారు. రాజా! శ్రీరామచంద్రస్వామి ఒంటరిగానే అతికొద్ది సమయంలోనే, ఖరదూషణాదులను, ఇతర రాక్షస సేనను సంహరించేసారు. విజయం రామునే వరించింది. ఆ ఆనందంతో సీతమ్మ రాముని సన్మానించింది అని తరువాత త్వరత్వరగా చెప్పారు.

శ్రీరాముని పరాక్రమ విశేషాలను విన్న కులశేఖరులు పరవశించి తమ ప్రయాణాం ఆపుకొని వెనక్కి తిరిగ వచ్చారు.

ఈ విధంగా మంత్రులు ఆలోచించారు. 'ఏమిటి? వీరు ఇలా అవుతున్నారు. రాజ్యం, వ్యవహారాలు అనే చింతనే లేదు. ఎప్పుడూ భక్తుల సేవలోనే ఉంటున్నారు. ప్రతి నిత్యము భగవత్ కథాశ్రవణము, భాగవతసేవ, దీనివల్ల ఎంతప్రమాదము కలిగింది. కాసేపు అయితే సముద్రంలో మునిగిపోయేవారు. ఏదో యోగము వారిని రక్షించింది. ఇది సరికాదు'. వీరిని మార్చాలి. ఈ విధంగా అంతా కలిసి నిశ్చయించుకున్నారు. కులశేఖరుల వద్దకు భక్తులు రావడానికి ఒక సమయము అంటూ ఉండేది కాదు. ఏ సమయములోనయినా వారిని తీసుకురావచ్చు అని తన పరివారానికి తెలిపారు. ఇలా భక్తులు సర్వకాల సర్వావస్థలయందు రాజును చేరి అతని వ్యవహారాలను చూసుకోనీయడం లేదు. అత్యవసర రాజ్యకార్యములనూ ప్రక్కన పెట్టి మరీ, వారికి సత్కారాలు చేస్తున్నారు. వీరి సంఖ్య రోజురోజుకు పెరిగిపోతోంది. వారి సత్కారాలకు ఖజానా ఖాళీ అయిపోతోంది. కనుక భక్తులను రానీయకుండా చేయాలి. అలా కావాలంటే ప్రభువుకు వారిపై విశ్వాసము పోవాలి. కనుక ఒక పథకాన్ని ఆలోచించి దానిని అమలు చేయడానికి అవకాశం కోసం నిరీక్షిస్తున్నారు.

అలా ఉండగా శ్రీరామనవమి వచ్చినది. ప్రతి సంవత్సరంలానే ఉత్సవాలు వైభవంగా చేయాలని నిశ్చయించారు కులశేఖరులు. దానికి తగ్గట్టుగా రాజు ఆజ్ఞమేరకు రాజమందిరము, కోళీ పట్టణము అంతా బహువిధముగా శోభాయమానముగా అలంకరించబడినది. పూజామందిరమంతా అర్చకస్వాములు అలంకరించారు. కళ్యాణానికి సిద్ధంచేస్తూ (పెరుమాళ్ళకు) అనేక విధములైన ఆభరణములను అలంకరించారు. కులశేఖరులు తన్మయంతో (పెరుమాళ్ళను) చూస్తూ ఉన్నారు. విలువైన ఆభరణములు ఇంకా ఎన్నో ప్రక్కనే ఉంచారు స్వామికి తిరుమంజనము (స్నానం) అయ్యాక అలంకరించాలని. ఈ సమయంలో మంత్రులు అంతా తమ పథకాన్ని అమలు చేయుటకు నిశ్చయించుకున్నారు. ఆభరణాలలోని విలువైన ముత్యాలహారమును తీసి దాచివేసారు. తిరుమంజనము పూర్తి అయి అలంకారమునకు ఆ ముత్యాలహారము కనబడలేదు. విషయాన్ని కులశేఖరులకు తెలియచేసారు. అంతట కులశేఖరులు ఎవరు ఆ హారాన్ని తీసారో విచారించమని మంత్రులను ఆజ్ఞాపించారు. వారు రాజా! రాజమందిరంలోనూ, పూజామందిరం సమీపములో సంచరించడానికి ఈ భక్తులకు తప్ప మరెవరికీ అవకాశం లేదు. అందువల్ల వీరిలోనే ఎవరో ఒకరు ఆ హారాన్ని అపహరించి ఉంటారు. మీరు ఇంతకాలం వీరిని విశ్వసించారు. అందువల్ల ఇలాంటి పనిని చేయగలిగారు. అని మంత్రులు భాగవతులపై నిందను మోపారు.

మంత్రుల మాటలు విని కులశేఖరులకు తీవ్రమయిన ఆగ్రహము కలిగినది. తనను ఏమైనా మాట అన్నా వారికి అంత కోపము కలిగేది కాదేమో? భాగవతోత్తములపైనా ఇలాంటి నింద వేసేది. అని ఈమాటలు అన్నది తనవారు కాబట్టి తానే శిక్షను అనుభవించాలి అని, తన మంత్రులవైపు కోపంగా చూస్తూ 'సఖిం సఖా సాధు న శాస్త్రియోఽధిపమ్' ప్రభువును పెడదారి పట్టించు మీరు మంత్రులా? కాదు. దుష్టబుద్ధికలవారు. నాకు భాగవతోత్తములపై సంపూర్ణ విశ్వాసము కలదు. వారు ఆ 'హారమును అపహరించలేదు. దీనిని నేను నిరూపిస్తాను' అని అన్నారు కులశేఖరులు. ఏవిధంగా నిరూపిస్తారో అని ఆ ఉత్సవమునకు వచ్చిన మిగతావారు ఆసక్తిగా చూస్తున్నారు.

కులశేఖరులు తన వద్దనున్నవారితో చెప్పి ఒక పాములవాణ్ణి పిలిపించారు. అతనిచే కొన్ని విషసర్పాలను తెప్పించి ఒక కుండలో వేసి మూత పెట్టించారు. అంతా ఆశ్చర్యంగా చూస్తూ ఉండిపోయారు ఏం జరుగుతుందా అని. అప్పుడు కులశేఖరులు అక్కడివారిని ఉద్దేశించి, 'భాగవతోత్తములు ఆ హారాన్ని అపహరించరనే నమ్మకం నాకున్నది. (ఒకవేళ వారు అలా చేస్తే) దీనిని నిరూపించడానికి నేనే ఈ పాములు ఉన్న కుండలో చేయిపెడతాను. ఒకవేళ వారు అలా చేస్తే కుండలోని పాములు నన్ను కరుస్తాయి. నా విశ్వాసమే సరి అయినదయితే ఆ పాములు నన్ను ఏమీ చేయలేవు' అని చెప్పారు. ఇది విన్న మంత్రులు తమ

తప్పును క్షమించమన్నారు. ఆ హారాన్ని మేము తీసాము. మీకు భాగవతోత్తములపై విశ్వాసమును తొలగించాలని ఆ పనిచేసాము. కాని మీ విశ్వాసాన్ని ఏ మాత్రం తగ్గించలేకపోగా మరింత పెంచగలిగేలా అయ్యింది. దీనితో మాకు అలాంటి విశ్వాసము కలిగింది. మా అజ్ఞానానికి తగిన శక్షను విధించమని కులశేఖరులను ప్రార్థించారు. కులశేఖరులు వారిని క్షమించారు. ఈ సంఘటన తనకు మంచినే కలుగచేసిందని భావించారు. కారణం ఇలానే రాజ్యవ్యవహారాలు నడిస్తే దేనిని సంపూర్ణంగా నిర్వహించలేక ఏవో ఆటంకాలు కలుగుతాయి అని అనుకున్నారు. వెంటనే 'ధృఢవ్రతు' డనే తన కుమారునికి పట్టాభిషేకం చేసి, రాజ్యవ్యవహారాలు అప్పగించారు. ఇక వారు ఎంతో కాలం నుండి అనుకుంటున్నది, 'శ్రీరంగయాత్ర' అదీ తాము ఒక్కరు కాక, భాగవతోత్తములతో కలిసి వెళ్ళి శ్రీ రంగనాథుడిని చూడాలని, ఆ కోరికను తీర్చుకునే అవకాశం కలిగింది. ఈ సంఘటన వల్ల ఈ విధంగా భాగవతోత్తములతో కలిసి శ్రీరంగం వెళ్ళి స్వామిని సేవిస్తూ వాని కైంకర్యములో తమ కాలాన్ని గడిపారు. ఈ విధంగా భగవత్, భాగవత కైంకర్యముతో 'ఆళ్వార్లు' గా ప్రసిద్ధిచెందారు.

వీరు 'ముకుందమాల' అనే సంస్కృత స్త్రోత్రాన్ని రచించారు. అలాగే 'పెరుమాళ్ తిరుమొళి' అనే దివ్యప్రబంధాన్ని అనుగ్రహించారు. మణి నిరంతరము అన్ని వైపులా కాంతులు వెదజల్లినట్లు వీరిలోని జ్ఞానము అనుభవ పరీవాహమై, భగవద్భాగవత కైంకర్యరూప కాంతులను వెదజల్లుటచే వీరిని పరమాత్మ 'కౌస్తుభ' అంశగా మన పెద్దలు భావిస్తారు. వీరివంటి భగవద్భాగవత నిష్ఠ మనకూ అలవడాలని ఈ శ్లోకముతో వారిని స్మరిస్తారు.

**కుంభే పునర్వసౌ జాతం కేరళే చోళపట్టణే।**
**కౌస్తుభాంశం ధరాధీశం కులశేఖర మాశ్రయే॥**

**నిత్య తనియ -**

**ఘుష్యతే యస్య నగరే రంగయాత్రా దినేదినే!**
**తమహం శిరసా వందే రాజానం కులశేఖరం॥**

జైశ్రీమన్నారాయణ